## ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

# ఇద్దరు దుర్మరణం




సతీష్, వీరవెంకటసత్యనారాయణ (పాతచిత్రాలు)

వనస్థలిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో నివాసముండే వీరవెంకట సత్యనారాయణ (32), కూకట్‌పల్లి మృదులానగర్‌లో నివాసముండే ముద్ద సతీష్ (38)లు లేబర్ పని చేస్తుంటారు. శనివారం ఉదయం ఇద్దరు వనస్థలిపురంలో ఇటుకల లారీని అన్‌లోడ్ చేసేందుకు తమ ద్విచ వాహనం ఎపి 29 ఎ 7380 (స్లెండర్ ప్లస్) పై వనస్థలిపురం బయలు దేరారు. సుష్మా థియేటర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ (టిఎస్ 09 యుడి 9599) డ్రైవర్ మహ్మద్ రఫీ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ, సతీష్‌లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ సతీమణి అద్దకి దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మెడికల్ మాఫియా

## నగరంలో అక్రమంగా బ్లడ్, ప్లాస్మా అమ్మకం



హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : నగరంలో మెడికల్ మాఫియా రెచ్చిపోతుంది. అక్రమంగా బ్లడ్, ప్లాస్మా, సీరం అమ్ముతూ..మనుషులు ప్రాణాలతో చెలగాటమాడుతోంది. తాజాగా మనుషుల రక్తం, ప్లాస్మా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న ముఠాను డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టుకున్నారు. నగరంలోని పలు బ్లడ్ బ్యాంకులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేపట్టారు. శ్రీకర ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్, న్యూలైఫ్ బ్లడ్ సెంటర్, ఆర్ఆర్ బ్లడ్ బ్యాంక్‌లో సోదాలు జరిపారు. క్లిమెన్స్, క్లినోవి రీసెర్చ్, నవరీచ్ క్లినిక్, జీ7 ఎనర్జీ, క్యూపీఎస్ బయోసర్వీస్‌లో తనిఖీలు నిర్వహించారు. శిల్ప మెడికల్, జెనీరైస్ క్లినిక్, వింప్టా ల్యాబ్‌లోనూ డ్రగ్ అధికారులు దాడులు నిర్వహించారు. మూసాపేట బాలాజీనగర్‌లోని హీమో ల్యాబొరేటరీస్‌లో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా బ్లడ్, ప్లాస్మా, సీరం నిల్వలను అధికారులు గుర్తించారు. అక్రమంగా హ్యూమన్ ప్లాస్మాలను అమ్ముతున్న ముఠాను అరెస్టు చేశారు. సంఘటన స్థలం నుంచి భారీగా ప్లాస్మా యూనిట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్లడ్ బ్యాంకుల ద్వారా సేకరించిన రక్తం నుంచి ప్లాస్మా, సీరం తీసి రీప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన హ్యూమన్ ప్లాస్మాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు తేలింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కేటుగాళ్లు ఈ దందా సాగిస్తున్నట్లు సమాచారం.

హీమో ల్యాబ్‌కి ఎలాంటి అనుమతులు లేవని డ్రగ్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ సౌభాగ్యలక్ష్మీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. మనుషుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న ముఠాను పట్టుకున్నామన్నారు. మనుషుల రక్తాన్ని సొమ్ము చేసుకుంటోందన్నారు. మూసాపేట, బాలాజీనగర్‌లోని హీమో ల్యాబొరేటరీస్‌లో సోదాలు జరిపామన్నారు.అక్రమంగా బ్లడ్, ప్లాస్మా, సీరం నిల్వలు గుర్తించామన్నారు. ప్లాస్మాను బ్లాక్ మార్కెట్‌లో వేల రూపాయలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రాఘవేంద్ర నాయక్ ఎనిమిదేళ్లుగా ఈ దందా చేస్తున్నాడని తెలిపారు. బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తం సేకరించి, దాన్నుంచి ప్లాస్మా, సీరం తీసి రీ ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నాడని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లో ఉన్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారు ఉల్ షిఫాలోని అబిద్ అలీఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, కర్నూలు జిల్లా ధర్మపేటలోని భాగ్యనగర్‌లో ఉన్న ఆర్ఆర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకుల నుంచి అక్రమంగా బ్లడ్ సేకరిస్తున్నట్లు గుర్తించామన్నారు.



ముగ్ధమనోహరం కూచిపూడి నాట్యం

ప్రముఖ నాట్యగురువు బాలాజీకుమార్ శిష్యురాలు యువనర్తకి కనగల నికిలా కూచిపూడి రంగప్రవేశం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ముగ్ధమనోహరంగా జరిగింది. భారతీయ శాస్త్రీయనృత్యం కూచిపూడిపట్ల మమకారం, పట్టుదల అంకితభావంతో 6సంవత్సరాల చిరుప్రాయంలోనే గురువు బాలాజీకుమార్ దొడ్డావద్ద నృత్యంలోని మెళకువలు, కూచిపూడిలో డిప్లొమా పొందింది.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బోరబండ సైట్ 3లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్ళే భాద్యత ప్రతి కార్యకర్తపై ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వివిధ శాఖల అధికారులతో కలిసి శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నారని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద వాడికి అందేలా చూస్తామన్నారు. బస్తీల కాలనీలలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపి పార్టీ గెలుపుకు నాయకులు కార్యకర్తలు గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# హైదరాబాద్ వార్త






## సందడిగా నర్సరీ మేళా

తీరొక్క రంగుల పూలు, ఇంటి లోపల, ఆవరణలో పెంచుకునే అలంకరణ.. వైవిధ్యమైన మొక్కలు మొదలుకొని బోన్సాయిల వరకు.. ఇలా విభిన్న రకాల మొక్కలు, కుండీలు, గార్డెనింగ్ వస్తువులతో పీపుల్స్ ప్లాజాలోని గ్రాండ్ నర్సరీ మేళా ఆకట్టుకుంటున్నది. తెలంగాణ అవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్న మేళా దేశ, విదేశీ పూల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. పచ్చదనం పరుచుకొని..అందమైన మొక్కలతో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నది.హార్టికల్చర్ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు తోటలు, ఎరువులు, ఆర్గానిక్ ఉప్పత్తులు, అగ్రికల్చర్, ఎనర్జీ సేవింగ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ సైన్స్, ఎడ్యుకేషన్, ఫుడ్ ఇండస్ట్రీ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. మొక్కలు కొనుగోలు దారులు వాటి పక్కన నిల్చుని ఫొటోలు తీసుకునేందుకు సందర్శకులు పోటీ పడుతున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా ఉంటుందని మార్టికల్చర్ షో ఇన్‌చార్జి ఖాలీద్ అహ్మద్ తెలిపారు.

# బల్దియాలో అభివృద్ధి పనులకు బ్రేక్



- రుణాలకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు
- రూ.1000కోట్లకుపైగా కాంట్రాక్టర్లు బకాయిలు
- డబ్బులు ఇస్తే పనులు ప్రారంభించమంటున్న కాంట్రాక్టర్లు
- అధ్వాన్నంగా ఆర్థిక పరిస్థితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: హైదరాబాద్ మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ఆర్థిక పరిస్థితి రోజురోజుకు అధ్వాన్న స్థితికి చేరుకుంటుంది. అవసరాలకు అనుగుణంగా నిధులు అందక ఇబ్బందులు తప్పడం లేదు. ఓవైపు జీతాలు, మరోవైపు అభివృద్ధి పనులు, దీంతో పాటు చేసిన పనులకు డబ్బులు చెల్లించలేక, తెచ్చిన రుణాలకు వడ్డీలు కట్టలేక ఏం చేయాలో దిక్కుతోచన పరిస్థితులు నెలకొంటున్నాయి. నగరంలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేపట్టారు, పూర్తిస్థాయిలో నిధులు అందుబాటులో లేకపోవడంతో అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు చేసిన డబ్బులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఇప్పటికే పలు సార్లు ధర్నాలు చేశారు ఫలితం లేదు...ఆశించిన స్థాయిలో నిధులను విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. గత కొంత కాలంగా నగరంలో ఒక్క అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగడం లేదు.

అసెంబ్లీ ఎన్నికల ముందు ఆగిన పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. మరోవైపు పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరో రెండు మూడు నెలల పాటు బల్దియాలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడనుంది. నగరంలో వివిధ అభివృద్ధి పనుల కోసం జిహెచ్ఎంసి వివిధ సంస్థల నుంచి రూ.6200కోట్ల రూపాయల వరకు రుణాలను తీసుకుంది. ఈ మొత్తాలకు యేడాదికి రూ.1000కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తోంది. వీటితో పాటు అవసరాలకు మించి పనులకు

మిగతా సిటీ 3వ పేజీలో

# హాజరు పేరుతో అవినీతి

## ఉపకార వేతనాలకు కొర్రీ ✣ పరీక్షలకు అనర్హులంటూ ప్రకటన

### డబ్బులు తీసుకుని అనుమతిస్తున్న కళాశాలలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త: విద్యాప్రమాణాలు పెంచేందుకు తప్పనిసరిగా హాజరు అవసరమని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం.. కొన్ని కళాశాలలకు ఆదాయ వనరుగా మారింది. కళాశాలలో ఆధ్యాపకులను భర్తీ చేయకుండా, మౌలిక వసతులు సమకూర్చకుండా విద్యార్థుల వచ్చి ఏమ లాభమని పలువురు విద్యారంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కువ కళాశాలల్లో చాలా సబ్జెక్టులలో భోదకులే లేరు. ఉన్నకొద్ది మంది ఇతర పనుల్లో నిమగ్నమైపోయారు. కొందరు మాత్రమే తరగతి గదికి వెళ్లి అప్పుడప్పుడు భోదిస్తున్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు హాజరు 75శాతం తప్పనిసరిగా ఉండాలని నిబంధన పెట్టారు. అప్పుడే పరీక్షలకు అర్హులని విశ్వవిద్యాల యాలు ఆదేశాలు జారీ చేశాయి. అనుబంధ కళాశాలలు వాటిని అమలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా కళాశాలలలో బయోమెట్రిక్ అమర్చుకున్నాయి. 2017లోనే పిజి కోర్సులకు బయోమెట్రిక్ విధానాన్ని జెఎన్‌టీయూహెచ్ అమ లులోకి తీసుకువచ్చింది. ఇదే విధానాన్ని యూజీ కోర్సులకు అమలు చేస్తుంది. ఉస్మానియా, జెఎన్ఏఎఫ్‌యూ, తెలుగు విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులకు ఇప్పటికీ హాజరుపట్టీల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇదే విధానాన్ని చాలా అనుబంధ కళాశాలలు అనుసరిస్తున్నాయి. 75శాతం హాజరులేని వారి నుండి ఇచ్చినంతగా కొన్ని కళాశాలలు దండుకుంటున్నాయి. హాజరు తక్కువ శాతాన్ని బట్టి మరింత ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు పలువురు విద్యార్థులు విమర్శిస్తున్నారు.

హాజరు తక్కువ వచ్చిందనే కారణాన్ని చూపించి ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకా లను విద్యార్థులకు దూరం చేస్తున్నారు. 75శాతం హాజరుకాలేదని, ఉపకార వేతనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకానికి అనర్హులంటూ నగరంలోని కొన్ని కళాశాలలకు విద్యార్థులకు వివరిస్తున్నాయి. ఫీజు సాయం అందకపోతే ఈకోర్సులు చదవలేమని నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మధ్యలోనే మానేస్తున్నారు. ఒక్కొక్క ఏడాదికి ముప్పైవేలకు పైగా సొంతంగా కట్టుకోవాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

గ్రేటర్ పరిధిలోని కొన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్కరోజు కూడా తరగతులు పూర్తిగా జరిగిన సందర్భాలే ఉండటం లేదు. ఉదయం ఒకటి రెండు తరగతులు మాత్రమే జరుగుతున్నాయి. ఉస్మానియా, జెఎన్‌టియూహెచ్, తెలుగు యూనివర్సిటీతోపాటు వీటి అనుంధ గుర్తింపుతో వేలాది కళాశాలలు నడుస్తున్నాయి. వీటిల్లో చాలావరకు కళాశాలల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకులే లేదు ఉన్నవారితో ఒకటిరెండు తరగతులు మాత్రమే జరుగుతున్నాయి. ఈమాత్రం దానికి దూర ప్రాంతా లనుండి నుండి కళాశాలకు రావాలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత రోజుల్లో తరగతి గదుల అవసరం తగ్గిందన్నారు. దీనిని గుర్తించకుండా దూరప్రాంతాల్లోని విద్యాసంస్థలకు నిత్యం రావాలనే నిబంధన ఎవరికి ఉపయోగం అని నిలదీస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణతకు అవసరమైన విజ్ఞానాన్ని తరగతి గదుల్లోనే నేర్చుకోవాల్సిన అవసరం లేదని, నిపుణుల బోధనలు ట్యుటోరియల్స్ అందుబాటులో ఉన్నాయని వివరిస్తున్నారు. బయోమెంట్రిక్ హాజరు అడ్డుక పెట్టుకుని కొన్ని కళాశాలలు అవినీతికి పాల్పడతున్నాయని పలువురు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

## బిఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలి

### తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: గ్రేటర్‌లో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమావేశం మహబూబ్ కళాశాలలోని ఎస్.వి.ఐ.టీ. ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి కార్యకర్తలు, పోలింగ్ బూత్ కమిటీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు కురుమ హేమలత, మహేశ్వరీ, కొలను లక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఆకులరూప, అత్తెల్లి అరుణ గౌడ్, శేషుకుమారి, శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, శ్రీనివాస్ గౌడ్, బాల్ రెడ్డి, వెంకటేషన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

## 15న ఒక రోజు ఆటో బంద్.. భారీ ర్యాలీ

సైఫాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణంకు బదులుగా సంపూర్ణ మద్యాపాన నిషేదాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న ఒక రోజు 'ఆటో బంద్-భారీ ర్యాలీ' నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ చెప్పారు. ఆటో బంద్-ర్యాలీలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలోని పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఆటోలకు బాడుగలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే 15 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, పూట గడవక ఆటో డ్రైవర్ ప్రజా భవన్ ఎదుట ఆటోను దగ్ధం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని, ఆటో మీటర్ చార్జీలను పొరుగు రాష్ట్రాలలో ఉన్న మాదిరిగా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు అజీముద్దీన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రిని కలిసిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీశ్వర్‌గౌడ్, బాషిపాక నాగమణి యాదగిరి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్ గౌడ్‌తోపాటు వివేకానందనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బాషిపాక నాగమణి యాదగిరి కలిశారు. ఈ సందర్భంగా జగదీష్‌గౌడ్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నాయకులు మూకయ్య, డాన్ వెంకటేష్ పాల్గొన్నారు.

# పెరుగుతున్న కేన్సర్ బాధితులు

- నిత్యం 600 మంది రోగులకు పైగా సేవలు
- ఎంఎన్‌జెలో అత్యాధునిక సర్జరీలు
- కేంద్రం ఉచితంగా హ్యూమన్ ప్యాపిలోమ వ్యాక్సిన్
- క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి - డాక్టర్ ఎన్.జయలత

మెహిదీపట్నం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త : క్యాన్సర్ వ్యాధి పెనుభూతమై మానవున్ని దహించి వేస్తుంది. రోజురోజుకు క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ప్రజల్లో ఆందోళన కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ వ్యాధి నివారణపై అనేక చర్యలు చేపడుతున్న ప్రయోజనం లేకుండా పోతుండడంతో ప్రజల్లో అవగాహన చర్యలు చేపడుతున్నారు. నగరంలో గత 69 సంవత్సరాలుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తూ వస్తున్న ఎంఎన్‌జే ఆసుపత్రిలో నేటికి రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎంతో అత్యాధునికమైన రోబోటిక్ సర్జరీలతో సేవలందిస్తూ వస్తున్న ఎంఎన్‌జే ఆసుపత్రికి నిత్యం 600కు పైగా రోగులు వస్తున్నారు. పొగాకు, గుటక, పాన్‌మసాల, సిగరేట్, అల్సర్, పంటిపుండు, మహిళల్లో వచ్చే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌కు అనేక సర్జరీలు చేస్తూ ఎంఎన్‌జే ఆసుపత్రి సేవలందిస్తుంది. 18 సంవత్సరాల లోపు క్యాన్సర్ సోకిన చిన్నారులకు సైతం సేవలందించడంతో పాటు సత్యసాయి ఆర్గనైజేషన్ ఎన్‌జీవో సంస్థద్వారా చదువును నేర్పిస్తుంది.

**వ్యాక్సినేషన్ తప్పనిసరి..** కొన్ని క్యాన్సర్‌ల వల్ల కలిగే అపాయాన్ని తగ్గించడానికి కూడా వ్యాక్సిన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. అత్యధిక సెర్వైకల్ క్యాన్సర్‌లను, కొన్ని యోని మరియు వల్వార్ క్యాన్సర్‌లను నివారించేందుకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్ సహాయపడుతుంది. భవిష్యత్తులో కాలేయం క్యాన్సర్‌కు దారితీసే హెపటైటిస్ బిని నిరోధించేందుకు హెపటైటిస్ బి వ్యాక్సిన్ సహాయపడడం ద్వారా కాలేయం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

ఉచితంగా హ్యూమన్ ప్యాపిలోమ వ్యాక్సిన్ (హెచ్‌పివి) కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న హ్యూమన్ ప్యాపిలోమ వ్యాక్సిన్‌ను ఎంఎన్‌జె హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 1వేయి మందికి ఇవ్వడం జరిగింది. క్యాన్సర్ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా హెచ్‌పివిని 14 సంవత్సరాలలోపు పిల్లలకు రెండు విడతల వారిగా ఆరునెలల గ్యాప్‌తో ఇవ్వడం జరుగుతుంది. ఈ వ్యాక్సిన్ 98శాతం క్యాన్సర్ వ్యాధిని నివారిస్తుంది. మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. క్యాన్సర్ వ్యాధిలో తెలంగాణ 11వ స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ మాత్రం 7వ స్థానంలో ఉంది.

### క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి - డాక్టర్ ఎన్.జయలత (ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ )



క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.జయలత తెలిపారు. క్యాన్సర్‌ను ఎంత త్వరగా కనుక్కొని చికిత్స చేస్తే, అంత ఎక్కువ కాలం జీవించవచ్చని తెలిపారు. ఇది ఎక్కువగా పొగాకు, గుట్కా, పాన్‌మసాల, సిగరేట్, మద్యం తాగే వారికి నోటి క్యాన్సర్ ఎక్కువగా వస్తుందన్నారు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, గర్భాశ క్యాన్సర్‌లు వస్తాయన్నారు. ఎంఎన్‌జె ఆసుపత్రికి నిత్యం 600 మందికి పైగా క్యాన్సర్ రోగులు వస్తుండడంతో ప్రతి ఒక్కరికి చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, చతీస్‌గడ్, బీదర్, బిహార్ రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారని తెలిపారు. ఆసుపత్రిలో అత్యాధునికమైన రేడియోథెరఫీ, సర్జరీ, రోబోటిక్ సర్జరీ, కీమోథెరఫీతో పాటు రూ.25 లక్ష నుంచి 45 లక్షల వరకు ఖర్చు అయ్యే బోన్స్ ట్రాన్స్‌ప్లా సర్జరీలు కూడా చేయడం జరుగుతుందని వివరించారు. 18 సంవత్సరాల క్యాన్సర్ వ్యాధి సోకిన చిన్నారులకు సత్యసాయి ఆర్గనైజేషన్ ఎన్‌జీవో ద్వారా చదువు చెబుతున్నామన్నారు. గతంలో 65 సంవత్సరాలు పైబడిన వారికి ఈ క్యాన్సర్ వ్యాధి సోకేదని, ఇప్పుడు మాత్రం 35 సంవత్సరాలకే క్యాన్సర్ వ్యాధి సోకుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో పాటు వ్యాధి సోకిన వెంటనే చికిత్స నిర్వహిస్తే ఎక్కువ కాలం జీవించవచ్చాన్నారు.

## ఎన్టీఆర్ స్టేడియంలో 9 నుంచి 19వరకు పుస్తక ప్రదర్శన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: తెలంగాణ సాహిత్యాన్ని మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు ఇందిరాపార్కు ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

జ్ఞాన తెలంగాణ నిర్మించాలనే లక్ష్యంతో పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని, పుస్తక పఠనం చేయించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో 'బాల మేళా' నిర్వహిస్తున్నామన్నారు.

## వెంకటాపురంలో పర్యటించిన ఎమ్మెల్యే మర్రి



అల్వాల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): మంచినీటి సమస్య రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, కానాజీగూడ తదితర ప్రాంతాలులో స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. భూదేవినగర్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. పార్కులో టూల్ రూము ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. మంచినీటి సమస్యను ప్రధానంగా ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానని మర్రి ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చిరు. ఈ కార్యక్రమంలో డోలి రమేష్, అనీల్ కిషోర్, దేవయ్య గౌడ్, శ్రీనివాస్, మోసిన్, ప్రభాకర్, సాయికుమార్. రమ, అమృత, ఆశారాణి ఇతరులు పాల్గొన్నారు.

## కాంచన్‌బాగ్‌లో రెండు కిలోల గంజాయి స్వాధీనం

సైదాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను కాంచన్‌బాగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామాంతపూర్‌కు చెందిన అభిషేక్(19), బాలాపూర్‌కు చెందిన నాగ వంశీ(19), సైదాబాద్‌కు చెందిన రాజు(23)లు శుక్రవారం సాయంత్రం గంజాయి రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు కాంచన్‌బాగ్ పోలీసులు పీసల్‌బండ చౌరస్తాలో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి నుంచి 2 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసుల జరిపిన విచారణలో రామాంతపూర్‌కు చెందిన ప్రకాష్ నుంచి వీరు గంజాయిని కొనుగోలు చేసి 5, 6 గ్రాముల పాకెట్లుగా తయారు చేసి రూ.300 నుంచి రూ.500 వరకు వాటిని అమ్ముతున్నట్లుగా తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## ఫుట్‌పాత్‌ను పాదచారులే వినియోగించాలి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): రోడ్డుపక్కన గల ఫుట్‌పాత్‌ను పాదచారులు మాత్రమే వినియోగించుకోవాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసంలో భాగంగా శనివారం చిలకలగూడ, పద్మారావునగర్ సర్దార్‌పటేల్ కాలేజీలోని ఇంటర్, డిగ్రీ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో రోడ్డు భద్రతా అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఫుట్‌పాత్ కేవలం పాదచారులకే అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు జరుపుకుంటున్న వారికి ఫుట్‌పాత్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యాక్రమంలో ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

## వేగంగా వాహనాలు నడిపితే ప్రాణహానే

**సెంట్రల్‌జోన్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్-ట్రాఫిక్ మహ్మద్ షాకీర్‌హుస్సేన్**



సమావేశంలో ప్రసంగిస్తున్న హుస్సేన్, శంకర్‌రాజు తదితరులు

నాంపల్లి, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త) : వాహన చోదకులు వేగవంతంగా వాహనాలు నడపడం ప్రాణహాని అని అదే వారికి చివరి ప్రయాణం కావచ్చునన్న సెంట్రల్‌జోన్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్–ట్రాఫిక్ మహ్మద్ షాకీర్‌హుస్సేన్ హెచ్చరించారు. ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయినా, ప్రాణాలు గాలిలో కలిసిపోతే ఆయా కుటుంబాలు విచ్ఛిన్నమౌతాయని, ప్రమాదాల నివారణకు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకరరాజు, వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, కామర్స్ కాలేజీ విద్యార్థులకు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన షకీర్ హుస్సేన్ యువత ఎక్కువ వేగంగా, అపసవ్యదిశ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనపై ఇద్దరుకుమించి ప్రయాణిస్తూ రేసింగ్‌లు, స్టంట్స్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు.

## కోటి సంతకాల సేకరణను చేపట్టిన భజరంగ్‌సేనా



బేగంబజార్, ఫిబ్రవరి 3(ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం గోవును రాష్ట్రీయ గోమాతగా ప్రకటించాలని తెలంగాణ భజరంగ్‌సేనా కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త తెలిపారు. శనివారం కోఠి ఆంధ్రబ్యాంకు చౌరస్తాలో తెలంగాణ భజరంగ్‌సేనా ఆద్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ముందు గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల జాబితాను అందచేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గోవులు అనేకం కబేళాలకు తరలిస్తున్నట్లు ఆవేధన వ్యక్తం చేశారు. గోవులు, పర్యావరణం, పరిరక్షణకు, మానవళి, జీవిత ఆరోగ్యశైలికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. గోవుల పేడ, గోమూత్రం, అనేక రోగాలకు వైద్యంగా పనిచేస్తుందన్నారు. గోవుల వల్ల ఎలాంటి నష్టంలేదు. అనేక లాభాలు ఉన్నాయి. గోమాతగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు.

## ఈ నెల 8, 9తేదీల్లో ఢిల్లీలో బిసిల సమరభేరీ

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదవసారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో బిసిలకు మళ్లీ అన్యాయమే జరిగిందని, ఒకవైపు బడ్జెట్ చూస్తే బారెడు ... మరోవైపు బిసిలకు కేటాయింపులు మూరెడు అన్న చందంగా ఉన్నాయన్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ గత 9 సంవత్సరాలు కేంద్రం బిసిలకు అన్యాయం చేస్తూ మరోమారు దగా చేసిందని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ఇందుకు నిరసనగా ఈ నెల 8, 9 తేదీల్లో ఢిల్లీలో పెద్దయెత్తున సమరభేరి మ్రోగించనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు శనివారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో బిసి కులసంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి జాజుల శ్రీనివాస్‌గౌడ్ బిసిల సమరభేరి గోడపత్రికను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం కేంద్ర అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు కె.శ్యాంకుర్మా, విద్యార్థి సంఘం రాష్ట్రాద్యక్షుడు జి.మహేష్‌యాదవ్, బి.బాలరాజుగౌడ్, శ్యామల, మీనా, వెంకన్నగౌడ్, నరసింహాచారి తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు.

## ప్రభుత్వ సిటీ కళాశాల పూర్వ విద్యార్దిగా గుర్తింపే అమితానందం

**త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి**



సమావేశంలో పాల్గొన్న త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మధుయాష్కీ

చార్మినార్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త : ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్నప్పటికీ ప్రభుత్వ సిటీ కళాశాల పూర్వ విద్యార్దినని చెప్పుకోవడంలో తనకు అమితానందం కలుగుతుందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. పాతబస్తీ హైకోర్టు ప్రక్కనే ఉన్న సిటీ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల పూర్వ విద్యార్దులైన ఇంద్రసేనారెడ్డి, చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా, అధ్యాపకులు కలిసి కళాశాల తరుపున సన్మానించారు. ఈ సందర్భంగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ సిటీ కళాశాలకు సంబంధించిన ప్రతీ కార్యక్రమంలో పాలు పంచుకోవడం వల్ల తనకు నిజమైన సంతృప్తి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్దుల సంఘం కార్యదర్శి విద్యాధర్ భట్, సమ న్వయ కర్త డా.పావనీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా కిండర్ గార్డెన్ స్నాతకోత్సవం



కిండర్ గార్డెన్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

తార్నాక, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త: పల్లవి మోడల్ స్కూల్లో ఘనంగా కిండర్ గార్డెన్ స్నాతకోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడేక సందర్భంగా చిన్నారులు డ్రెస్సుల్లో చేతిలో కుచ్చులు పట్టుకొని అలరించారు. చిన్నపిల్లలు నృత్యప్రదర్శణతో పాటు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆకట్టుకున్నారు. ప్రతి ఒక్కరు ప్రేమ్ వర్క్‌తో విజయ శిఖరాలను అందుకోవాలని తిరుమలగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి సాగర్ పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన విజయాలను, సంస్థకు వారు తెచ్చిన ప్రశంసలను ప్రేక్షకులతో పంచుకున్నారు. స్కూల్ అకాడమిక్ కోఆర్డీనేటర్ నీలవేణి మాట్లాడుతూ చిన్నారులను బాల్యం నుంచే క్రమశిక్షణతో పాటు అన్ని విదాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లాస్ టీచర్ హిరా, డా.పూనమ్ సింఘాల్‌తో పాటు పలువురు విధ్యార్థుల తల్లి,తండ్రులు పాల్గొన్నారు.

## నల్లకుంట ట్రాఫిక్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా పదవీ భాధ్యతలు స్వీకరణ



డి.రాంబాబు

తార్నాక, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): నల్లకుంట ట్రాఫిక్ నూతన ఇన్స్పెక్టర్‌గా డి.రాంబాబు పదవీ భాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన రాంబాబు మహబూబ్‌నగర్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా డ్యూటీలో చేరారు. అక్కడి నుంచి ఆయన డబీపురాలో డిఐగా, సీఐడీలో ఇన్స్పెక్టర్‌గా ఐదు సంవత్స రాల పాటు పనిచేశారు. ఇక్కడ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన నాగరాజు రామ్‌గోపాల్ పేట్ ఎస్‌హెచ్ఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఇన్స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహణ కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు.

## నరెడ్కో 16వ జాతీయ సమావేశంలో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్




కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త : నరెడ్కో 16వ జాతయ సమావేశం, కే ంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖవారి సహకారంతో ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఈనెల 2,3 తారీఖుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ని ఆహ్వానించారు. ప్రేమ్‌కుమార్ నరెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులతో ఆ సమావేశంలో పాల్గొని బిల్డర్ల సమస్యలపై వినతిపత్రాన్ని నరెడ్కో జాతీయ అధ్యక్షులు జి.హరిబాబు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.చెన్నారెడ్డి, కెవి ప్రసాద్‌రావు, వడ్డేపల్లి రంగారావు తదితరలు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీకి అభినందనల వెల్లువ



అలీకి అభి నందనలు తెలియ జేస్తున్న శ్రీరంగం

కెపి హెచ్ బి కాలనీ, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎస్సి, ఎస్టీ, బీసి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మ ద్ షబ్బీర్ అలీని వారి కార్యాలయంలో శనివారం పిసిసి సభ్యులు టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి, పుష్పగు చ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## షబ్బీర్ అలీని కలిసిన జగదీశ్వర్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ షబ్బీర్ అలీని శనివారం ఆయన కార్యాలయంలో శేరి లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ కలిశారు.

## బల్దియాలో అభివృద్ధి పనులకు బ్రేక్

అనుమతులు ఇవ్వడంతో కాంట్రాక్టరకు రూ.1000కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. బకాయిలు చెల్లిస్తే పనులు ముందుకు సాగమని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఇంత పెద్ద మొత్తాలను విడుదల చేసేందుకు జిహెచ్ఎంసిలో నిధులు లేవు, నిధుల కొరత వేధిస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు వస్తేగానీ అభివృద్ధి పనులకు మోక్షం కలిగేలా కనిపించడం లేదు. మరోవైపు రుణాల కోసం అధికారులు చేస్తున్న ఫలితాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. జిహెచ్ఎంసికి వచ్చే ఆదాయం కంటే కూడా చెల్లించాల్సిన మొత్తాలు, బకాయిలు రెట్టింపులో ఉన్నాయి. ఆస్తి పన్ను, టౌన్‌ప్లానింగ్ ఇతరాల ద్వారా రూ.3000 కోట్ల వస్తోంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మరో రూ.900 నుంచి రూ.1000కోట్ల వరకు వస్తున్నాయి. దాదాపు రూ.4000 కోట్ల రూపాయలు వస్తోంది. ఖర్చు మాత్రం రూ.ఐదు నుంచి ఆరువేల కోట్ల వరకు వస్తుంది. ఆదానికి మించి ఖర్చులు పెరుగుతున్నాయి. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రాజెక్టులు, వివిధ రూపాలలో వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. గత కొంత కాలంగా జీతాలకు సైతం కటకట కొనసాగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బల్దియా ఆర్థిక పరిస్థితులు రోజురోజుకు దిగజారుతూ అప్పుల ఊబిలోకి వెళ్తుంది. ఇలాంటి పరిస్థితి కొనసాగిస్తే రానున్న రోజుల్లో అభివృద్ధి పనులకు అటకెక్కి, రోజువారికి ఖర్చులకు ఎతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు కాంట్రాక్టర్లు తమ బకాయిలను చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వివిధ రకాల చెల్లింపులు చేసుకుంటూ పోతే, వచ్చే ఆదాయం కంటే కూడా ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రోజురోజుకు బల్దియా ఆర్థిక పరిస్థితులు దారుణంగా మారుతోంది.

## ట్యాక్సులు చెల్లిస్తున్నా ట్రాఫిక్ పోలీసుల వేధింపులు



రోడ్డుపై ప్రయాణికులతో అసోసియేషన్ నేతలు

బేగంపేట, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): నిబంధనల ప్రకారం కాంట్రాక్టు క్యారియర్లుగా బస్సులను నడిపిస్తున్న తమపై ట్రాఫిక్ పోలీసులు వెంటనే వేధింపులు ఆపాలని బస్సు ఆపరేటర్లు కోరారు. శనివారం ప్యారడైజ్ వద్ద బేగంపేట ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలు అనుమతి లేని సమయంలో నగరంలోకి ప్రవేశించాయని రెండు బస్సులను నిలిపివేసి కేసు నమోదు చేసేందుకు రాంగోపాల్‌పేట్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, నేతలు కెండీ అహ్మద్, సయ్యద్ బిలాల్, మహ్మద్ అబ్దుల్ హాది తదితరులు విలేకరులతో మాట్లాడుతూ తాము వివాహాది శుభకార్యాలు, సైట్ సీయింగ్ లాంటి వాటికి బస్సులు తిప్పుతామని, దీనికోసం హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో తిప్పుకునేందుకు మూడు నెలలకు ఒకసారి రూ. 60వేలు ఆర్టీఏకు ట్యాక్సు చెల్లిస్తున్నామని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే స్టేజ్ క్యారియర్ బస్సులు నిర్ణీత సమయంలో నగరంలోకి ప్రవేశం ఉంటుందని, కాంట్రాక్టు క్యారియర్‌లుగా నడిపించే తమకు ఆ నిబంధనలు వర్తించవని వారు తెలిపారు.

## ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

బేగంపేట, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): బేగంపేట్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ డిగ్రీ కోర్సుల అడ్మిషన్‌లకు, ఇంటర్మీడియట్ పూర్తయిన, పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల కోర్సు పూర్తయిన, ఐటీఐ కోర్సు పూర్తిచేసిన వారు అర్హులని నిర్వాహకులు తెలిపారు. దూర విద్యద్వారా చదువుకోవాలనుకునే వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సులలో అడ్మిషన్‌లను ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. 2023, 2024 సంవత్సరానికి గాను అండర్ గ్రాడ్యుయేట్ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాలకు కావాల్సిన అర్హతలు, దరఖాస్తు వివరాల కోసం కళశాలలో సంప్రదించాలని కోరారు.

## వెంకయ్యనాయుడుని కలిసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



కెపి హెచ్ బి కాలనీ, ఫిబ్రవరి 3, (ప్రభాతవార్త : ప్రజా వ్యవహారాల విభాగంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకి పద్మ విభూషణ్ పుర స్కారంకు ఎంపికైన శుభ సందర్భంగా ఆయన నివాసంలో శనివారం శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసారు. సివిఆర్ ఛానల్ చైర్మన్ చలసాని వెంకటేశ్వరరావు, ఖమ్మం కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావులతో కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా**

## తనకు టికెట్ కెటాయించాలి : విజయ్ సురానా

కంటోన్మెంట్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త: మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని తనకు అప్పగిస్తే బారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ కోశాధికారి విజయ్ సురానా తెలిపారు. శనివారం కంటోన్మెంట్‌లోని ఏఓసి సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిజెపి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ సురానా మాట్లాడుతూ మల్కాజిగిరి, కంటోన్మెంట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అనేక సేవలు అందించామన్నారు. తన సేవలు గుర్తించి అధిష్టానం మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థిగా కెటాయించాలని అధిష్టానాన్ని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.



ఏఓసి సెంటర్‌లో బిజెపి కార్యాలయం ప్రారంభిస్తున్న రాష్ట్ర కో-శాధికారి విజయ్ సురానా తదితరులు

## ఎమ్మెల్యేను కలిసిన స్కూల్ సిబ్బంది

జియాగూడ, ఫిబ్రవరి 3(ప్రభాతవార్త: జియాగూడలోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ ఈనెల 10వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కొలే తెలిపారు. జియాగూడలోని ఎన్‌బిపి గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.వినోద్ విచ్చేయనున్నట్లు తెలిపారు. గత 20సంవత్సరాలుగా జియాగూడలోని విద్యా బోధనలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు పిఎం రాజు, ఠాకూర్ రఘునందన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు

## షబ్బీర్‌అలీకి వకుళాభరణం శుభాభినందనలు

నాంపల్లి, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సలహాదారుగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహ్మద్ షబ్బీర్ అలీని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం డా. బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని షబ్బీర్‌అలీ కార్యాలయంలో ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి కృష్ణమోహన్‌రావు శుభాభినందనలు తెలిపారు.

## క్రీడల ద్వారా పోలీసులలో సమిష్టితత్వం పెరుగుతుంది

**హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్**
**ముగిసిన రాచకొండ కమిషనరేట్ ఐదవ వార్షిక స్పోర్ట్స్‌మీట్-2024 పోటీలు**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జితేందర్, సుధీర్‌బాబు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త): క్రీడల ద్వారా పోలీసులలో సమిష్టితత్వం పెరుగుతుందని రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ పేర్కొన్నారు. సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఐదవ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2024 క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జితేందర్ మాట్లాడుతూ క్రీడలు వ్యక్తుల మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లలతో కూడుకున్నదని, తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ ద్వారా పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతి భద్రతల నిర్వహణ, నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని మరింత అంకిత భావంతో పనిచేస్తూ ఆ మంచిపేరును కొనసాగించాలని సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు సాగిన రాచకొండ పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న అన్ని జట్లను, విజేతలను అభినందించారు. తమ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు మానసికోల్లాసాన్ని అందించే లక్ష్యంతో రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాచకొండ అన్ని జోన్లు, వివిధ పోలీసు విభాగాల నుంచి మొత్తం ఎనిమిది జట్లు క్రికెట్, వాలీ బాల్, ఫుట్ బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సారి రాచకొండ కమిషనరేట్ మినిస్టీరియల్ సిబ్బంది కూడా ఉత్సాహంగా ఈ క్రీడా పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. డిసిపి లు రాజేష్ చంద్ర, పద్మజ, గిరిధర్, ప్రవీణ్‌కుమార్, మురళీధర్, అదనపు డిసిపిలు, పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ:: సర్కిల్-2, ఉప్పల్ GHMC

టెండర్ ప్రకటన నిట్ నెం.22/E/HD/UPL/GHMC/2023-24, తేది: 02.02.2024, పని పేరు: 4 పనుల కొరకు "GHMC ఉప్పల్, వార్డు నం.10లో లక్ష్మీనారాయణ కాలనీలో గ్రావెల్ ఉపరితలంపై సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేయుట" (ST కమ్యూనిటీ వ్యక్తులకు మరియు సొసైటీలకు రిజర్వ్ అయిఉన్నది). GHMC, ఉప్పల్ సర్కిల్-2లో ఉప్పల్, వార్డ్ నం.10లో, భరత్‌నగర్, కుర్మ సంఘం వద్ద కమ్యూనిటీ హాల్‌కు 2వ అంతస్తు యొక్క నిర్మాణం. అంచనా మొత్తం: రూ.86.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 06.02.2024 మ.03.00 గం. అధికారి పేరు, చిరునామా: శ్రీ ఎల్.నాగేందర్, EE, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నం.2, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-2, GHMC
DIPR.No.10063-PP/CL/Advt/1/2023-24, తేది: 03.02.2024

వార్త VAARTHA CLASSIFIEDS

LOST OF PASSPORT

★ I GURRAM JAGDEESH VIJAY KUMAR S/o G. JAGDEESH R/o Flat No.103, Amrapali Arcade, Himayath Nagar, Hyderabad. I was Travelling Himayath Nagar to Khairatabad by Bus on 14.01.2024, I lost my Original Passport bearing No.E4050154. If anyone found Plz Cont: 9985699007.
(Ro.No.065787)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీమతి దస్‌ఖత్ మాధురి S/O W/O దస్‌ఖత్ వికాశ్, ఇం.నం.10-19/25, 102, సిద్ధార్థ ఆర్కేడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం దగ్గర, న్యూ గాయత్రీనగర్, సరూర్‌నగర్, మీర్‌పేట, K.V. రంగారెడ్డి, తెలంగాణ నివాసి, రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్, రెవెన్యూ మండలం, కర్మన్‌ఘాట్ రెవెన్యూ గ్రామంలో అగ్రికల్చరల్ కాలనీ వద్ద ఉన్న బ్లాక్ నం.7, వార్డ్ నం.8 క్రింద, సర్వే నం.లు 60 భాగంలోని, ప్లాట్ నం.381పై నిర్మించబడిన 795 చ.గజాల కొలతల మొత్తం విస్తీర్ణం గల బహిరంగ భూమిలో 40 చ.గజాల ఏరియా కొలత గల భూమిపై ఆసక్తి మరియు అవిభాజ్య వాటా నిష్పత్తితోపాటు 100 చ.అడుగుల యొక్క స్టిల్ట్ అంతస్తులో కార్‌పార్కింగ్ మరియు 998 చ.అడుగుల ప్లింత్ ఏరియా కలిగిన (కామన్ ఏరియా కలుపుకొని) "మనీషాస్ ఆర్యా రెసిడెన్సీ"గా తెలిసిన అపార్ట్‌మెంట్ యొక్క (PTIN నం.1040802282) ఇం.నం. 8-7-98/85/P-1/381/403. 4వ అంతస్తులో నివాసిత ఫ్లాట్ నం.403 యొక్క మొత్తం ఆదంతా దాని యొక్క సంపూర్ణ యజమాని మరియు స్వాధీనకర్తగా ఆమె ప్రకటిస్తున్నారు మరియు ఆమె పైన ప్రకటించిన ఆస్తి యొక్క ప్రియర్ సేల్ డీడ్ ఏదైతే సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.10586/2018 తేది: 26.01.2018 అయివున్నదో దాన్ని పోగొట్టుకొన్నారు.
సదరు డాక్యుమెంట్లు దొరికినవారు, వారం రోజులలోగా ఈ దిగువ సంతకందారుని సంప్రదించవచ్చును మరియు వాటిని స్వాధీనపరచకోరుతున్నాము. ఏదైనా సంస్థ/ఏవరైనా వ్యక్తి/లు/ బ్యాంక్‌లు/ఆర్థిక సంస్థలు పైన పేర్కొన్న సదరు ఆస్తికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, క్లైమ్, హక్కు, ఆసక్తి, ఏవిధమైన స్వభావం గల వివాదం అయినా అతడు/ఆమె/వారు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి ఏడు (7) రోజులలో అతని యొక్క/ఆమె యొక్క/వారి అభ్యంతరం క్లైమ్, హక్కు, ఆసక్తి/వివాద వివరాలతో వాటిని నిరూపించగల డాక్యుమెంటరీ నిరూపణలతో దిగువ సంతకందారుని సంప్రదించవలెను. విఫలమైతే నా క్లైంట్ ఎటువంటి అభ్యంతరాలు/క్లైమ్‌లు/ ఎవరి యొక్క వివాద వివరాలు/వ్యక్తి/లు ఎవరి నుంచి ఏమీ లేవని నిర్ధారించి మరియు తర్వాత క్లైమ్‌లు లేదా వివాదాలు ఏమీ పరిగణించబడవు జరగదని తెలియజేస్తున్నాను.
ప్రసాదరావు అప్కారి, న్యాయవాది
ఫ్లాట్ నం.103, కృష్ణారెడ్డి విల్లా, బ్లాక్-బి, ఇ.నం.1-11-271/D1/1036, గగన్‌విహార్ కాలనీ, భగవంతపురం, బేగంపేట, హైదరాబాద్.
ఇ-మెయిల్: advprasada.apkari@outlook.com
మొబైల్: 9582796964, 8106795964, 040-35941590

IN THE COURT OF THE HON'BL Ist JR. CIVIL JUDGE, CITY CIVIL COURT AT : SECUNDERABAD
OS No. 232 of 2020
Between :
State Bank of India
RACPC - I, Secunderabad ...Plaintiff
And
Ms. Richa Mittal ...Defendant
To
Mrs. Richa Mittal,
W/o Indranil Chakraborty
Flat No. 201, 2nd Floor, Akshaya Residency, Malani Enclave, Thirumalgiry, Secunderabad-500020

NOTICE
The above named plaintiff filed suit for Money Recovery against both of you for Rs.2,06,035/- (Rupees Two Lakhs Six Thousand and Thirty Five only) before the Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, at Secunderabad The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to 16-02-2024 for your appearance. You have to appear before Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, at Secunderabad., at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.
By order of the Hon'ble Ist Jr. Civil Judge, City Civil Courts, at Secunderabad
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No.31, Tarbund Bazar, Tarbund, Secunderabad - 500 009,
Ph : 040-29558473,
Cell : 8885625424

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATIOR AT MEDCHAL DIST
DISPUTE NO. 719 OF 2022
M/S RAO BROTHER'S CHIT FUND PRIVATE LIMITED, KPHB Branch, Hyderabad. ...Disputant
Vs.
Mr. Bantu Ramesh Babu & OTHERS ...Opponents
To
1. Mr. Bantu Ramesh Babu, S/o Yadagiri Bantu, R/o Fl.No.201, Pooja Residency, Road no.8, Subrahmanyam Nagar Colony, Hyderabad 500059.
2. Mr. Tadikapalli Veeranna, S/o T. Venkataiah, R/o H.No. 1-11-122/19/A, GHMC-350, Ashok Nagar, Chikkadapalli, Hyderabad 500020.
3. Mrs. Sambari Sobha Rani, W/o M.Ramu, R/o H.No.8-1-40/4, Samath Colony, Opp 7 Tombs Road, Near Axis bank ATM, Shaikpet, Hyderabad 500033.
4. Mr. Kodirekka Raja Shekar, S/o K.Yohan, R/o H.No.9-1-42/A, Prashanthi Nagar, Near Govt. High School, Langar House, Hyderabad 500008.
5. Mr. Bantu Sai Kiran, S/o B. Ramesh Babu, R/o H.No.G-1, Sri Sai Residency, Laxmi Nagar Post office, Near Saibaba temple, Opp Greenz Fruits and Vegitables, Saidabad, Hyderabad 500059.
6. Mr. Bantu Sai Charan, S/o B. Ramesh Babu, R/o H.No.G-1, Sri Sai Residency, Laxmi Nagar Post office, Near Saibaba temple, Opp Greenz Fruits and Vegitables, Saidabad, Hyderabad 500059.
Please take notice that the above dispute is filed against you for recovery of Rs.5,71,787/- And the same is posted to date: 17-02-2024 for your appearance before the office of deputy registrar of chits/arbitrator, Medchal-malkajgiri Dist., At : Medchal at 12.00 am if you fail to attend the office of deputy registrar of chit, Arbitrator on the day the matter will be heard and decided exparty.
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATIOR AT MEDCHAL DIST
DISPUTE NO. 720 OF 2022
M/S RAO BROTHER'S CHIT FUND PRIVATE LIMITED, KPHB Branch, Hyderabad. ...Disputant
Vs.
Mrs. Dholvan Jyothi & OTHERS ...Opponents
To
1. Mrs. Dholvan Jyothi, W/o M. Raghu, R/o H.No.8-12-96/5/117, Ground Floor, Bhupashguptha Nagar, Hyderabad 500079.
2. Mrs. Sapavat Jhansi, W/o Sudheer Naik, R/o H.No. 14-175/1, Ganesh Nagar T.K.R College South Gate, Meerpet, Hyderabad 500097.
3. Miss. Galeti Suguna, D/o G. Venkat Ramana, R/o Srt.No.162, 1st Floor, Near Sanath Nagar Bus stop, Sanath Nagar, Hyderabad 500018.
4. Mrs. purra Prashanthi, W/o G. Raju, R/o H.No.5-163, M.G. Road, Near Aryabhatta Degree College, Patanchervu, Hyderabad 502319.
Please take notice that the above dispute is filed against you for recovery of Rs.3,06,269/- And the same is posted to date : 17-02-2024 for your appearance before the office of deputy registrar of chits/arbitrator, Medchal-malkajgiri Dist., At : Medchal at 12.00 am if you fail to attend the office of deputy registrar of chit, Arbitrator on the day the matter will be heard and decided exparty.
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR

# బడా బాబులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

## ఏసిపి, టీపీఎస్‌ల ఆధ్వర్యంలో అవినీతి రాజ్యం

## డబ్బులు ఇవ్వకపోతే నిర్మాణాలు కూల్చివేతలు



టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** బడా బాబులకు అనుకూలంగా పని చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి గడ్డిఅన్నారం కార్పొరేటట్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ సరూర్‌నగర్ సర్కిల్ అధికారులు వివేకానందనగర్ బస్‌స్టాప్ వద్ద భవన నిర్మాణదారుడికి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పోలీసు బందోబస్తు మధ్యనిర్మాణాన్ని కూల్చివేశారు. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ సంఘటన స్థలానికి చేరుకొని టౌన్‌ప్లానింగ్ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అనుచరులు ఏకంగా 5, 6 అంతస్తుల భవనాలను, సెల్లార్లు అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాణలపై పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసిన పట్టించుకోవడం లేదని నిర్మాణదారులు డబ్బులు ఇవ్వకపోతే మాత్రం కూల్చివేతలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే పార్క్ స్థలాన్ని కాపాడాలని సరూర్‌నగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులను కోరిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి పనితనానికి నిదర్శనం అన్నారు. టౌన్‌ప్లానింగ్ సరూర్‌నగర్ సర్కిల్ విభాగంలో ఏసిపి, టీపీఎస్‌ల ఆధ్వర్యంలో అవినీతి రాజ్యం నడుస్తుందని ఆరోపించారు. గడ్డిఅన్నారం డివిజన్ నలుమూలాల అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, బడాబాబులకు అనుకూలంగా పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, రఘునందన్‌జోషి, శశాంక్‌నాయుడు, టీంకు, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

# రశీదు లేకుండా సిలిండర్ల సరఫరా చేస్తే తగిన చర్యలు : డిటి మాచన రఘునందన్



గ్యాస్ సిలిండర్ల ఆటో ట్రాలీని తనిఖీ చేస్తున్న రఘునందన్

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రశీదు లేకుండా గ్యాస్ సిలిండర్లను సరఫరాచేస్తే గ్యాస్ ఏజన్సీపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్ డిటి మాచన రఘునందన్ స్పష్టం చేశారు. శుక్రవారం తుర్కయాంజాల్ వద్ద గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ రశీదులు లేకుండా గ్యాస్ ఎలా సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాయ్, పాని పేరిట వినియోగదారులనుంచి అధిక మొత్తం వసూలు చేస్తే గ్యాస్ ఏజన్సీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిలిండర్లను రశీదులు లేకుండా గిడ్డంగి నుంచి ఎలా పంపారని వెంకటరమణ గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులను నిలదీశారు. తూనికలు కొలతల శాఖ అనుమతి పత్రాలను పరిశీలించారు. వినియోగదారులవద్ద అందినంత దండుకుంటున్నారన్న ఫిర్యాదులు అధికంగా ఉన్నాయన్నారు. ఒకవేళ ఎవరైనా వినియోగదారులు గ్యాస్ గిడ్డంగి నుంచి సిలిండర్లు తీసుకెళ్తే 20 రూపాయలు తక్కువ చెల్లించినా పర్లేదని స్పష్టం చేశారు.

# తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి: కమిషనర్ శ్రీకాంత్

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు (ట్రేడ్ లైసెన్సులు) చెల్లించి తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కమీషనర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ లక్ష్మీనగర్, సుందరయ్యనగర్, ఇంద్రమ్మ కాలనీలతో పాటు వార్డులలో మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటన చేసి పన్ను వసూళ్ల చేసారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించుట ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధి అవుతుందన్నారు. స్వచ్ఛందంగా వచ్చి ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు చెల్లించిన వారిని కమీషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ శేఖర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ ప్రశాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించవద్దు : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్



వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

**మలక్‌పేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** వీధి వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించవద్దని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వీధివ్యాపారస్తులు, హాకర్స్‌తో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించడంవల్ల పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

# ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించి ఓటింగ్‌విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాక్ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. నామినేషన్ల దాఖలు, బ్యాలెట్‌ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, గెలుపొందిన అభ్యర్థులకు ధృవీకరణపత్రాలు జారీ చేయడం తదితర అంశాలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించామని జిహెచ్ ఎం పద్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఓటర్లుగా, అభ్యర్థులుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారని తెలిపా రు. మాక్ ఎన్నికల సందర్భంగా పాఠశాలలో పూర్తిగా ఎన్నికల వాతావరణ నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, జయసింహారెడ్డి, శ్రీలత, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సెవెన్‌సీటర్స్, ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని శనివారం ఎమ్మెల్యేని కలిసి పలు సమస్యలను వివరించారు. బిఎన్‌రెడ్డినగర్, సంతోష్‌నగర్,ఎల్బీనగర్ గతంలో ఆటోలు నడిపామని, ప్రస్తుతం ట్రాఫిక్‌పోలీస్ అధికారులు ఆటోలు ఆయా ప్రాంతాలలో నడవకుండా ఇబ్బందుల గురి చేస్తున్నారని డ్రైవర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పోలీసులు తరచూ జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ట్రాఫిక్ ఏసీపీలతో ఫోన్లో మాట్లాడి ఆటోడ్రైవర్ల ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో సెవెన్ సీటర్స్ అసోసియేషన్ నాయకులు సంతుయాదవ్, ఛాన్‌పాషా, అజీమ్, మహేందర్ పాల్గొన్నారు.

# చేవెళ్ళ ఎంపి స్థానానికి కాంగ్రెస్ తరపున మేయర్ పారిజాత దరఖాస్తు



పారిజాత తరపున గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్న చిగిరింత దయాసాగర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని కోరుతూ మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పారిజాత తరపున ఆమె తనయుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి పలువురితో కలిసి గాంధీభవన్‌లో పార్టీ పార్లమెంట్ ఎన్నికల కమిటీకి దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. 2006వ సంవత్సరంలో రాజకీయ ఆరంగ్రేటం చేసిన పారిజాత సర్పంచ్‌గా, ఆ తర్వాత మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీకి సేవలు అందించారు. అనంతరం 2020లో జరిగిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా ఎన్నికై ఆ తర్వాత బిఆర్ఎస్‌లో చేరి మేయర్ అయ్యారు. అనంతరం 2022 జూలైలో బిఆర్ఎస్‌ను వీడి స్వంత గూటికి చేరారు. కాగా ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఆమె చేవెళ్ళ ఎంపి టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె తన కుమారునిచే గాంధీభవన్‌లో తన దరఖాస్తును ఎన్నికల కమిటీకి సమర్పించారు.

# ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌కు కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి చెన్నయ్య అధ్యక్షతన రాగన్నగూడ ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు రాయితీ, పేద ప్రజలపై భారం మోపిందన్నారు. 10 ఏళ్ల బిజెపి పరిపాలనలో అదాని ఆస్తులు పెరిగాయి కానీ అన్నదాతల కష్టాలు, కార్మికుల కనీస వేతనాలు అందకుండా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని మోడీ మత తత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ భారత సార్వత్రిక సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాటసంఘం కెవిపిఎస్ సంపూర్ణంగా బలపరుస్తుందని సామాజిక శక్తులు సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మెడికల్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్యవర్గ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన యూనియన్ ప్రతినిధులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా దుర్గం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నూకం బిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ గంధం శాంతికుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ రఫీయుద్దీన్‌తోపాటు ఆర్గనైజింగ్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు చేతులమీదుగా యూనియన్ నూతనక్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సచివాలయంలో వివిధ రాజకీయ ప్రతినిధులకు ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను విన్నవించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుభాష్, నర్సింహులు, వెంకట్‌రాథోడ్, శ్రీనివాస్, ప్రదేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

**కుషాయిగూడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్‌మరమ్మత్తుల కారణంగా కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని నార్త్‌కమలనగర్,ఏపీఐఐసీకాలనీ, కుషాయిగూడవిలేజ్, ఇండస్ట్రియల్ ఏరియా మార్కండేయనగర్, పద్మావతి కాలనీ, పోచమ్మ టెంపుల్ జీనియ హాస్పిటల్ ఏరియా, భారత్ పెట్రోల్‌బంక్ వెనుక భాగం, కమలానగర్ బిల్డర్స్ అమూల్య హోమ్స్, శశికాంత్‌నగర్, సీతారాంనగర్, సుభాష్‌చంద్రనగర్, పరిమళానగర్, సుబ్రహ్మణ్యనగర్, భవాని నగర్, ఏపీఐఐసీ కాలనీ, పల్లె ప్యారడైజ్, శ్రీనగర్ కాలనీ హన్స్ ఎవెన్యూ, విరాట్‌నగర్, శ్రీరామ్‌నగర్, ప్రాంతాల్లో ఆదివారము ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.



హరిహరపురం కాలనీ త్రిశక్తి ఆలయంవద్ద వేస్తున్న సిసి రోడ్ పనులను ఎఇ నరేంద్ర తేజతో కలిసి పరిశీలిస్తున్న బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు (ప్రభాతవార్త, వనస్థలిపురం)

# వాహనదారుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యం



రోడ్డు భద్రత ఉత్సవాల సందర్భంగా వాహనదారులకు సూచనలు చేస్తున్న డి.టి.ఓ కిషన్, ఆర్టీవో రవీందర్ కుమార్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** జనవరి 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరుగుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పేట్ బషీరాబాద్‌లోని మేడ్చల్ డిటివో కార్యాలయంలో రోడ్డు భద్రతపై ఆర్టీవో అధికారులు వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకొని బాధ్యత కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, ముఖ్యంగా ఫోర్ వీలర్ వాహనాలకు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు జి.రవికుమార్, ప్రతాప్‌రాజా, బి.అమృతవర్షిని, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, రామకృష్ణ, ఇష్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతోనే డివిజన్ అభివృద్ధి : కార్పొరేటర్ అనిల్‌యాదవ్



యుజిడి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అనిల్ యాదవ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని తన 16వ డివిజన్‌ను మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన డివిజన్‌లోని ఓల్డ్ పాశ్ కాలనీలో సబితారెడ్డి మంజూరు చేయించిన రూ.5 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ లైన్లు పాడవ్వడంతో వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేయడానికి సబితారెడ్డి సహకరించారని తెలిపారు. ఈ మేరకు కాలనీ ప్రజల తరపున ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ టెంపుల్ ధర్మకర్త మేకల యాదగిరి, స్థానికులు మహమ్మద్ అలీ, నర్సింహ, శ్రీకాంత్ సాగర్, మురళి ముదిరాజ్, బషీరా బీ సాయిరా, పర్వీనా తదితరులు పాల్గొన్నారు.

# మ్యాన్‌హోల్ నిర్మాణ పనిలో కాలనీవాసులు సహకరించాలి : కార్పొరేటర్ బద్దం

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారండివిజన్ శ్రీకోదండరాంనగర్ కాలనీ రోడ్ నెంబర్ 2లో భూగర్భ డ్రైనేజ్ మ్యాన్ హోల్‌పై భారీ వాహనాలు వెళ్లడంతో మ్యాన్‌హోల్ ధ్వంసమవడంతో తరచుగా డ్రైనేజీ పొంగుతుందని కాలనీవాసుల సమాచారం మేరకు కాలనీలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజ్ మ్యాన్‌హోల్ నాణ్యతతో నిర్మించక పోవడం వల్ల తరచూ కాలనీవాసులు, వాహనదారులకు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సరైన ప్రణాళికతో ఏలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ సరిత, మేనేజర్ రజిత, కాంట్రాక్టర్ శ్రీకాంత్, కాలనీ వాసులు ఒట్టే రాజు, రాహుల్, గిరీష్, రమణరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, రఘునందన్‌జోషి, టీంకు, శశాంక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ డివిజన్‌లోని కాలనీలలో కార్పొరేటర్ అరుణ పాదయాత్ర



నాలా పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎల్ఐసి కాలనీ, మాధవనగర్ కాలనీలలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తూ సమస్యలను పరిశీలించారు. కాలనీలలో పారిశుధ్య నిర్వహణ గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వా:హణపై నిర్లక్ష్యం చేయరాదని, బస్తీలు, కాలనీలలోని చెత్తను పోగు చేసి వాహనాల్లో తరలించాలని, స్థానికంగా కాల్చవద్దని కార్మికులకు సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలంతా పారిశుధ్య కార్మికులతో సహకరించాలన్నారు.

**నాలా పూడికతీత పనుల పరిశీలన...** శంకేశ్వర్ బజార్ నాలాలో పూడికతీత పనులను కార్పొరేటర్ అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలాలో పూడికతీతను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోలో అభిరాంకు బంగారు పథకం



అభిరాంను సన్మానిస్తున్న మేజిస్ట్రేట్ సల్మా ఫాతిమా తదితరులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** వనస్థలిపురంకు చెందిన సీనియర్ న్యాయవాది ఎన్‌వి రమణ కుమారు ఎన్.వెంకటఅభిరాం రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ సీనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో బంగారు పథకం సాధించాడు. ఈ సందర్భంగా హయత్‌నగర్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం మేజిస్ట్రేట్ సల్మా ఫాతిమాతోపాటు బార్ అసోసియేషన్ సభ్యులు అభిరాంను సన్మానించి ముున్ముందు మరిన్ని పథకాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఎజిపి సత్యనారాయణ, అడ్వకేట్లు వంశీకృష్ణ, రామ్మోహన్, ప్రవీణ్‌కుమార్, శివ, శంకరయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

# మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనల దృశ్యం

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం అరణ్య నాట్య డాన్స్ అకాడమీ గురువర్యులు సమతారావు శిష్య బృందంచే భరతనాట్య నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. గణేష్ పంచరత్న, పుష్పాంజలి, మల్లరి, మూషిక వాహన, అయిగిరి నందిని, హనుమాన్ చాలీసా, నటేశ కౌతం, తిల్లాన, అలరింపు, భోశంభో, హరివారాసం మొదలైన అంశాలను ప్రదర్శించారు. ఆకర్ష, కృష్ణన్యా, పలక్షి, ప్రేరణ, రన్విత, దీక్షిత, రితిక, వార్షిత, కవిత, అనుష్క, కృషిత, టీనా, వైష్ణవి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# రూ.62 లక్షలతో సీసీ రోడ్డు పనులు: గీత

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ సీతారామకాలనీలో 62 లక్షల వ్యయంతో వేసిన సిసి రోడ్ పనులను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో సీవరేజ్, స్ట్రామ్ వాటర్, డ్రైన్ పైపులైన్ల పనులు పూర్తయిన ప్రాంతాల్లో ప్రణాళిక బద్ధంగా నూతన సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. సీసీ రోడ్డుకు నిర్దేశించిన సమయానుసారం క్యూరింగ్ చేయాలని, అదేవిధంగా రోడ్డు ఇరువైపులా మట్టి నింపి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గూడూరు రమేష్‌గౌడ్, ఎఇ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్‌రెడ్డి, కోకొండ జగన్, రామానుజం, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్న సామల రంగారెడ్డికి సన్మానం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామ పరిధిలో భవ్యమైన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని స్వంత డబ్బులతో నిర్మిస్తున్న పూర్వపు సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సామల రంగారెడ్డిని శనివారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి సన్మానించారు. ఆర్‌సిఐ రోడ్డు సమీపంలోని ఎస్‌పిఆర్ గార్డెన్స్‌కు ఆనుకొని సువిశాల స్థలంలో కృష్ణ శిలలతో ప్రఖ్యాత తమిళనాడు ఆలయ నిర్మాణ కార్మికులచే చారిత్రక ఆలయం మాదిరిగా అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సామల రంగారెడ్డి, ఆయన తనయుడు సామల ప్రవీణ్‌రెడ్డి నిర్మిస్తుండడంతో శనివారం శంకర్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్గాని శ్యామల

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** అమరవీరుల స్తూపం గన్‌పార్క్ వద్ద తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలంగాణ బీసీ మహిళ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుగ్గాని శ్యామలకు నియామక పత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నరేందర్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. నా వంతుగా బీసీ సమాజం కోసం పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరాగాని బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం నాగోల్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళలకు జీవనోపాధి కలగాలని, కుటుంబానికి ఆసరా అవ్వాలన్నారు. మహిళల జీవితాల్లో మరింత వెలుగు నిండాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ మహిళా విభాగం జనరల్‌సెక్రటరీ మంజుల, గీత, సీత, కాచం సుస్మా, జగతి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కెపురం డివిజన్ అలకాపురికాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఆర్ మీడియా వర్క్స్ అధ్వర్యంలో శనివారం క్యారం టోర్నమెంట్ పోటీలను రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డితో కలిసి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పిట్ట హరినాథ్‌రెడ్డి, అల్కాపూరికాలనీ ప్రెసిడెంట్ వివిఎస్.వంశీ, కార్యదర్శి శ్రీనివాస్, సైదారావు, రాజు, రాజునాయక్, దినేష్‌సింగ్, భాస్కర్ నాయక్, ప్రేమ్‌నాయక్, విజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 338 కాటన్ల నకిలీ మద్యం సీసాల ధ్వంసం



జేసీబీతో మద్యం సీసాలను ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** 2022 డిసెంబరులో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఒడిసా రాష్ట్రం కటక్ అభయారణ్యంలో పట్టుకున్న మద్యాన్ని నిబంధనల మేరకు శనివారం పెద్దఅంబర్‌పేటలో సరూర్‌నగర్‌ఎక్సైజ్ సూపరింటెండ్ రవీందర్‌రావు, హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ రవీందర్‌రావు మాట్లాడుతూ కటక్ ప్రాంతంలోని అభయారణ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు మద్యం తయారీ పరిశ్రమను నెలకొల్పి అక్కడినుంచి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు మద్యం సరఫరా చేస్తున్న విషయంపై విచారణ చేపట్టిన తెలంగాణ ఎక్సైజ్ అధికారులు సదరు పరిశ్రమపై దాడులు చేసి సుమారు 3 వేల లీటర్ల (338 కాటన్ల) ఆఫీసర్స్ చాయిస్, ఐబీ మద్యంకాటన్లను స్వాధీనం చేసుకున్నారు.సదరు మద్యం కేసుల విచారణ అనంతరం నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల అనుమతుల మేరకు పెద్దఅంబర్‌పేటలో ధ్వంసం చేశారు. పలు రసాయణ పరీక్షల అనంతరం సదరు మద్యం తాగడానికి హానికరమని తేలడంతో దానికి ధ్వంసం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు వివరించారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 35 బస్తాల(1050 కిలోలు) నల్లబెల్లాన్ని గౌరెల్లి సమీపంలో మూసీలో పాడేసినట్లు తెలిపారు. నగర శివారులో ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువగాఉన్నాయని డ్రగ్స్,గంజాయి సరఫరాదారులు యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. తద్వారా వారి ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయి, నల్లమందు, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం వింటి విషయాలపై వెంటనే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు వెంకన్న, యాదయ్య, హనుమంతు, సరళ, సిబ్బంది పాల్గొన్నారు.